నెట్ స్కోరుతో బోధన... పరిశోధన!

బోధనలో మేటి అవకాశాలకు మెట్టు... జాతీయ అర్హత పరీక్ష (నెట్). ఇందులో అర్హత పొందినవారు జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడవచ్చు. జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్)కు ఎంపికైనవారు నెలనెలా స్టైపెండ్ అందుకుంటూ పీహెచ్‌డీ పూర్తిచేసుకోవచ్చు. ఈ స్కోరుతోనే మేటి సంస్థల్లో ఉద్యోగానికీ దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షను యూజీసీ తరఫున ఏడాదికి రెండుసార్లు ఎన్‌టీఏ నిర్వహిస్తోంది. ఇటీవలే డిసెంబరు ప్రకటన వెలువడింది.

యూజీ కోర్సులో నైపుణ్యానికి కొలమానం నెట్. దీన్ని 83 సబ్జెక్టులు/విభాగాల్లో దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. భాషలు తప్పించి, మిగిలిన సబ్జెక్టుల ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటాయి. ఇందులో అర్హత పొందితే.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడవచ్చు. మేటి స్కోరు ఉన్నవారికి డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు విద్యాసంస్థలు అధిక వేతనంతో ఉద్యోగాలిస్తున్నాయి. పలు పోటీ, ప్రవేశ పరీక్షల నిమిత్తం శిక్షణ ఇస్తోన్న సంస్థలూ నెట్ స్కోరుకు ప్రాధాన్యమిస్తున్నాయి. జాతీయ స్థాయిలో ఎస్సీ, ఓబీసీ, దివ్యాంగ విభాగాల్లో నేషనల్ ఫెలోషిప్పులు పొందడానికి నెట్ అర్హత తప్పనిసరి. కొన్ని మహారత్న, నవరత్న సంస్థలు నెట్ స్కోర్‌తో మేనేజ్‌మెంట్ ట్రెయినీ హోదాతో.. లీగల్, హ్యూమన్ రిసోర్సెస్, మార్కెటింగ్ విభాగాల్లో ఉద్యోగాలు అందిస్తున్నాయి. ప్రైవేటు సంస్థలు నెట్ అర్హులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పిస్తున్నాయి.

పరీక్ష ఏవిధంగా?

మొత్తం రెండు పేపర్లు. వీటికి 300 మార్కులు. 150 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకూ రెండు మార్కులు. అభ్యర్థులందరికీ మొదటి పేపర్ ఉమ్మడిగా ఉంటుంది. ఇందులో 50 ప్రశ్నలు వంద మార్కులకు వస్తాయి. రెండో పేపర్‌లో వంద ప్రశ్నలు 200 మార్కులకు ఉంటాయి. ఈ ప్రశ్నపత్రం అభ్యర్థి ఎంచుకున్న విభాగం/సబ్జెక్టు నుంచి ఉంటుంది. రుణాత్మక మార్కులు లేవు. పరీక్ష వ్యవధి 3 గంటలు. పేపర్ 1, 2 మధ్య విరామం లేదు. పరీక్షను ఉదయం, మధ్యాహ్నం ప్రతి రోజూ నిర్వహిస్తారు.

పేపర్ 1: పది విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. అవి.. టీచింగ్ ఆప్టిట్యూడ్, రిసెర్చ్ ఆప్టిట్యూడ్, కాంప్రెహెన్షన్, కమ్యూనికేషన్, మ్యాథమెటికల్ రీజనింగ్ అండ్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రెటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, పీపుల్, డెవలప్‌మెంట్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టం. అభ్యర్థి బోధన, పరిశోధన రంగాల్లో రాణించగలరా, లేదా తెలుసుకునేలా ప్రశ్నలు వస్తాయి. ఆలోచన విధానం, ఆంగ్లాన్ని అర్థం చేసుకునే తీరు, గణితంలో ప్రాథమిక పరిజ్ఞానం, తర్కం, విశ్లేషణ సామర్థ్యం, కమ్యూనికేషన్ సాధనాలు, అభివృద్ధి, పర్యావరణం, ఉన్నత విద్యలకు సంబంధించి ప్రశ్నలు వస్తాయి. వర్తమాన సంఘటనలనూ స్పృశిస్తారు.

పేపర్–2: ఈ విభాగంలో ప్రశ్నలన్నీ అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టు నుంచే ఉంటాయి. ఆ సబ్జెక్టులో.. ప్రాథమికాంశాలు, అనువర్తనం, విశ్లేషణ, అవగాహన, జ్ఞానం పరిశీలించేలా వీటిని అడుగుతారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలోనే ఉంటాయి. సబ్జెక్టులో లోతైన పట్టున్నవారే సమాధానం ఇవ్వగలరు. ప్రతి అంశాన్నీ విస్తృతంగా, సూక్ష్మంగా చదివితేనే నెగ్గగలరు.

జేఆర్ఎఫ్ జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్) అవకాశం వచ్చినవారు మేటి సంస్థల్లో పీహెచ్‌డీ దిశగా అడుగులేయవచ్చు. వీరికి ప్రతి నెలా రూ.31,000 చొప్పున మొదటి రెండేళ్లు చెల్లిస్తారు. అనంతరం ఎస్ఆర్ఎఫ్‌కు అర్హత సాధిస్తే రూ.35,000 చొప్పున స్టైపెండ్ అందుతుంది. సంబంధిత సంస్థ

వసతి కల్పించకపోతే స్టైపెండ్‌లో 30 శాతం వరకు హెచ్ఆర్ఏ చెల్లిస్తారు. ఏటా కంటింజెన్సీ గ్రాంటు అందుతుంది.

ఉపయోగపడే పుస్తకాలు పేపర్-1, 2ల కోసం.. ట్రూమెన్స్/అరిహంత్/ఉప్‌కార్/ టాటా మెక్‌గ్రాహిల్స్/ పియర్సన్- వీటిలో ఏదైనా ఒకటి లేదా రెండు పుస్తకాలు తీసుకోవచ్చు.

కటాఫ్ సబ్జెక్టుల వారీగా మారుతుంది. ఆ సబ్జెక్టులో ఎంతమంది పరీక్ష రాశారు, ప్రశ్నపత్ర కఠినత్వం ప్రకారం ఈ మార్పులు ఉంటాయి. లెక్చరర్‌షిప్ అయితే ఏ సబ్జెక్టు అయినప్పటికీ అన్ రిజర్వ్‌డ్ అభ్యర్థులు 200 మార్కులు పొందితే సరిపోతుంది. అదే జేఆర్ఎఫ్ కోసమైతే 220 వరకు రావాలి. కొన్ని సబ్జెక్టుల్లో 180 మార్కులకూ లెక్చరర్‌షిప్ పొందవచ్చు. జేఆర్ఎఫ్ 200కి లభిస్తోంది.

ఇలా సన్నద్ధం కండి!

- ముందుగా మీ సబ్జెక్టులో సిలబస్ వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలి. యూజీసీ వెబ్‌సైట్‌లో ఇవి ఉన్నాయి. వాటిని ప్రామాణికంగా తీసుకోవాలి.
- ప్రాథమికాంశాలపై పూర్తి అవగాహన ఉంటేనే జవాబులు గుర్తించగలం. అందువల్ల సన్నద్ధత అక్కడ నుంచే ప్రారంభించాలి.
- ప్రశ్నలు ఆ సబ్జెక్టులో మీకెంత పట్టు ఉందో తెలుసుకునేలా రూపొందిస్తారు. పలు అంశాలను జోడించి ఒకే ప్రశ్నగానూ అడుగుతారు. ఇలాంటివాటికి సబ్జెక్టులోని ప్రతి అంశంపైనా లోతైన పరిజ్ఞానం అవసరం.
- మీ సబ్జెక్టులో ఇంటర్మీడియట్, తర్వాత డిగ్రీ పాఠ్యాంశాలను విస్తృతంగా చదవాలి. ఆ తర్వాత పీజీ, రిఫరెన్స్ పుస్తకాలను అధ్యయనం చేయాలి.
- రిఫరెన్స్ పుస్తకాలను పరిమితంగా ఎంచుకుని, వాటినే బాగా చదవాలి. చదువుతున్నప్పుడే ముఖ్యాంశాలను తక్కువ వ్యవధిలో పూర్తయ్యేలా నోట్సు రాసుకోవాలి. పరీక్షకు ముందు వీటిని మరోసారి మననం చేయాలి.

- పరీక్షలో విజయానికి పాత ప్రశ్నపత్రాలే దిక్సూచి. వీటి నుంచి.. ప్రశ్నలడిగే విధానం, వాటి స్థాయి, అంశాలవారీ లభిస్తోన్న ప్రాధాన్యం తెలుసుకోవచ్చు. సన్నద్ధతలో అవసరమైన మార్పులు చేసుకోవచ్చు.
- రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సెట్/స్లెట్ పేపర్లు పరిశీలించవచ్చు. జేఎల్, డీఎల్ ప్రశ్నపత్రాలూ ఉపయోగపడతాయి. పీజీ ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల అధ్యయనమూ మేలు చేస్తుంది.
- సన్నద్ధత పూర్తయిన తర్వాత కనీసం పది మాక్ టెస్టులు రాయాలి. ఇందులో సాధించిన స్కోరు గమనించాలి. ఏ ఛాప్టర్లు/విభాగాల్లో తప్పులొస్తున్నాయో తెలుసుకుని వాటిపై మరింత శ్రద్ధ వహించాలి. ఇదే పద్ధతిని చివరి పరీక్ష వరకు కొనసాగిస్తే విజయవంతం కావచ్చు.
- రుణాత్మక మార్కులు లేవు కాబట్టి బాగా ఆలోచించి తెలియని ప్రశ్నకూ జవాబు గుర్తించాలి. ఏదైనా ప్రశ్నకు ఒకటి కంటే ఎక్కువ సమాధానాలు ఉన్నా, ప్రశ్నలో ఏమైనా పొరపాట్లు ఉన్నా బోనస్ మార్కులు ఇస్తారు. అయితే ఆ ప్రశ్నకు ఏదో ఒక ఆప్షన్ జవాబుగా గుర్తించినవారికే ఇవి దక్కుతాయి. ఏ సమాధానమూ ఇవ్వనివారికి ఈ మార్కులు జత చేయరు. అందువల్ల ఏ ప్రశ్ననూ విడిచిపెట్టకూడదు.
- గతంలో అడిగిన ప్రశ్నలు పునరావృతం కావడానికి అవకాశం తక్కువే. అయినప్పటికీ పాత ప్రశ్నపత్రాల ద్వారా.. ప్రశ్నలు ఏ స్థాయిలో, ఏ విధంగా అడుగుతున్నారో తెలుస్తుంది. దీంతో ఏ తరహా ప్రశ్నలు రావొచ్చో, వాటిని ఎదుర్కోవడానికి ఏం నేర్చుకోవాలో అవగతమవుతుంది. అందువల్ల గత ఐదేళ్ల ప్రశ్నపత్రాలను బాగా అధ్యయనం చేయాలి.
- మీ సబ్జెక్టులో ఇటీవల విజయం సాధించిన వారి మెలకువలూ, ప్రొఫెసర్ల సూచనలూ సన్నద్ధతలో ఉపయోగపడతాయి.
- సిలబస్‌లో అన్ని అంశాలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. ఉన్న వ్యవధిలోనే మొత్తం సిలబస్ చదవడం పూర్తిచేయాలి.
- పరీక్షలో విజయానికి పునశ్చరణ (రివిజన్) ప్రధానం. అందువల్ల పరీక్షకు పది రోజుల ముందు నుంచీ పూర్తిగా రివిజన్‌కే కేటాయించాలి. నేర్చుకున్న అంశాలన్నీ మరోసారి మననం చేసుకోవాలి.
- ఎంత సమయం, ఎన్ని రోజులు చదివారు, ఎన్ని పుస్తకాలు అధ్యయనం చేశారు- ఇవేవీ విజయానికి ప్రామాణికం కాదు. ఉన్న వ్యవధిని ఎంత బాగా సద్వినియోగం చేసుకున్నాం, సన్నద్ధతలో నాణ్యత, పరిమిత పుస్తకాలనే పూర్తిగా చదివి, పునశ్చరణ చేసుకోవడం.. ఇవే విజయానికి సోపానాలు.
- పరీక్ష ఒత్తిడి లేకుండా జాగ్రత్త తీసుకుని, ఆత్మవిశ్వాసంతో రాస్తే అనుకూల ఫలితాలు వస్తాయి.

నెట్‌తో సెట్...

నెట్ జాతీయ స్థాయి పరీక్ష. అందువల్ల ఈ స్కోరుతో దేశంలో ఏ రాష్ట్రం/విశ్వవిద్యాలయంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకైనా పోటీపడవచ్చు. సెట్ రాష్ట్ర స్థాయి పరీక్ష. కాబట్టి ఈ అర్హతతో సొంత రాష్ట్రంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకే అవకాశం ఉంటుంది. నెట్ ఏటా రెండుసార్లు (సాధారణంగా జూన్, డిసెంబరుల్లో) నిర్వహిస్తారు. సెట్ కోసం ప్రత్యేకంగా క్యాలండర్ లేదు. నెట్‌లో అర్హత సాధించడం కష్టమే కానీ, ఏటా రెండుసార్లు నిర్వహించడం వల్ల అదే ప్రయత్నంలో ఉన్నవారు విజయవంతం కాగలరు. విలువ పరంగా చూస్తే నెట్‌కే అధిక ప్రాధాన్యం. నెట్‌కు సన్నద్ధమైతే సెట్‌లో అర్హత పొందడం సులువే.

ముఖ్య వివరాలు

విద్యార్హత: సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ నాన్ క్రీమీ లేయర్, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు 50 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం పీజీ కోర్సులు చదువుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత పొందడానికి వయసు నిబంధన లేదు. జేఆర్ఎఫ్ కోసం డిసెంబరు 1, 2023 నాటికి 30 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ నాన్ క్రీమీ లేయర్, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, మహిళలకు గరిష్ఠ వయసులో ఐదేళ్ల సడలింపు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 28 (సాయంత్రం 5 గంటల వరకు).

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1150. ఓబీసీ (నాన్ క్రీమీ లేయర్), ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈబీసీ)కు రూ.600; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు రూ.325.

పరీక్షలు: డిసెంబరు 6 నుంచి 22 వరకు నిర్వహిస్తారు.

పరీక్ష కేంద్రాలు: తెలుగు రాష్ట్రాల్లో అన్ని ముఖ్య ప్రాంతాల్లోనూ ఇవి ఉన్నాయి.

వెబ్‌సైట్: https://ugcnet.nta.ac.in/

సెలవు పెట్టి 'లా' చేయనా?

వ్యవసాయ శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా ఏడేళ్లుగా పనిచేస్తున్నాను. నా వయసు 26 సంవత్సరాలు. మూడేళ్లు సెలవు తీసుకుని.. లా డిగ్రీని రెగ్యులర్‌గా చదువుతూ లా కోర్సుకు సంబంధించిన పార్ట్ టైమ్ జాబ్ చేయాలనుకుంటున్నా. నా నిర్ణయం సరైనదేనా?

- ఎస్.పవన్

■ మీరు ప్రస్తుతం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగానికి సెలవు పెట్టి లా డిగ్రీని చదివిన తర్వాత మీరు మళ్లీ ఉద్యోగంలో చేరితే, ఆ డిగ్రీ మీకెలా ఉపయోగపడుతుంది? ఆ డిగ్రీతో ప్రమోషన్ వస్తుందా? అనేవి పరిగణనలోకి తీసుకోండి. ఒకవేళ, మీరు ఉద్యోగానికి రాజీనామా చేసి లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తే, మొదట్లో కొంతకాలం పాటు ఆర్థికపరమైన ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి రావచ్చు. ఈ విషయాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని అందుకు సంబంధించిన ఆర్థిక ఆసరాను ఏర్పాటు చేసుకున్నాక రాజీనామా చేయండి.

మీరు లా కోర్సు చదువుతూనే న్యాయవాద వృత్తికి సంబంధించిన పార్ట్ టైమ్ జాబ్ చేయాలనుకుంటున్నారు. కానీ, లా లాంటి ప్రొఫెషనల్ కోర్సుల్ని చదివేటప్పుడు ఆ కోర్సుపై పూర్తి శ్రద్ధ పెడితే విషయ పరిజ్ఞానం బాగా వస్తుంది. ఆర్థిక ఇబ్బందులవల్ల ఉద్యోగం చేయడం తప్పనిసరైతే ఎవరైనా సీనియర్ లాయర్ దగ్గర అసిస్టెంట్‌గా చేరే ప్రయత్నం చేయండి. ఈ ప్రయాణంలో మీరు వృత్తి మెలకువలు నేర్చుకొంటారు గానీ, ఆశించినంతగా వేతనాలు లభించవు. న్యాయవాద వృత్తిలో రాణించాలంటే విషయ పరిజ్ఞానంతోపాటు నైపుణ్యాలూ చాలా అవసరం. చేయబోయే పార్ట్ టైమ్ జాబ్‌లో వేతనంతో సంబంధం లేకుండా న్యాయవాద వృత్తిలో మెలకువలు, నైపుణ్యాలు నేర్చుకొనే ప్రయత్నం చేయండి.

చివరిగా, మీ నిర్ణయం సరైనదేనా అనేది న్యాయవాద వృత్తిపై మీకున్న ఆసక్తి, మీ సామర్థ్యంపై మీకున్న నమ్మకం, కమ్యూనికేషన్, నెట్ వర్క్ నైపుణ్యాలు, క్లిష్ట సమస్యల్ని పరిష్కరించగల నేర్పు, మీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు లాంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటిఫికేషన్స్

ప్రవేశాలు

సీఐటీడీ, హైదరాబాద్‌లో పీజీ డిప్లొమా

హైదరాబాద్ బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ 2023 విద్యా సంవత్సరానికి పీజీ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్ అండ్ క్యాడ్/ క్యామ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

వయసు: 45 సంవత్సరాలు మించకూడదు.

అర్హత: బీఈ, బీటెక్ (మెకానికల్/ ప్రొడక్షన్) ఉత్తీర్ణులై ఉండాలి.

కోర్సు వ్యవధి: 18 నెలలు (3 సెమిస్టర్లు).

ప్రవేశ విధానం: ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ ప్రాతిపదికన సీటు కేటాయిస్తారు.

దరఖాస్తు రుసుము: ఎస్సీ/ ఎస్టీలకు రూ.350; ఇతరులకు రూ.700.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: 31-10-2023.

ప్రవేశాల కౌన్సెలింగ్ తేదీ: 11-11-2023.

వెబ్‌సైట్: https://www.citdindia.org/

కాళోజీ వర్సిటీలో ఎంపీటీ కోర్సు

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ 2023-24 విద్యాసంవత్సరానికి వర్సిటీతో పాటు అనుబంధ కళాశాలల్లో మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ (ఎంపీటీ) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

అర్హత: బీపీటీ లేదా తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై, 30-09-2023లోపు ఇంటర్న్‌షిప్ పూర్తిచేసివుండాలి.

ఎంఎస్సీ నర్సింగ్

కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీతో పాటు అనుబంధ కళాశాలల్లో ఎంఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

అర్హత: కనీసం 55% మార్కులతో బీఎస్సీ (నర్సింగ్) లేదా పోస్ట్ బీఎస్సీ (నర్సింగ్)తో పాటు అయిదేళ్ల పని అనుభవం.

ఈ రెండు కోర్సులకూ...

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 7-10-2023.

వెబ్‌సైట్: https://www.knruhs.telangana.gov.in/

ఉద్యోగాలు

సైనిక్ స్కూల్ కొడగులో ఆర్ట్ మాస్టర్, వార్డెన్‌లు

కర్ణాటకలోని సైనిక్ స్కూల్ కొడగు ఒప్పంద ప్రాతిపదికన 7 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

★ **ఆర్ట్ మాస్టర్:** 1 ★ **బ్యాండ్ మాస్టర్:** 1 ★ **వార్డెన్:** 4 ★ **పీఈఎం/ పీటీఐ కమ్–మాట్రాన్ (ఫీమేల్):** 1

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం.

ఎంపిక: పోస్టును అనుసరించి రాత పరీక్ష/ నైపుణ్య/ ప్రాక్టికల్ టెస్ట్ ఆధారంగా.

దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ప్రిన్సిపల్, సైనిక్ స్కూల్ కొడగు' చిరునామాకు పంపించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 20-10-2023.

వెబ్‌సైట్: www.sainikschoolkodagu.edu.in/

ఎస్‌సీటీఐఎంఎస్‌టీ, తిరువనంతపురంలో టీచింగ్ పోస్టులు

తిరువనంతపురంలోని శ్రీ చిత్ర తిరునల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ (ఎస్‌సీటీఐఎంఎస్‌టీ) 5 పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

★ **అసోసియేట్ ప్రొఫెసర్ (ఇమేజింగ్ సైన్స్ అండ్ ఇంటర్వెన్షన్ రేడియాలజీ):** 1

★ **అసిస్టెంట్ ప్రొఫెసర్ (న్యూరాలజీ):** 2

★ **అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్:** 1

★ **సీనియర్ పర్చేజ్ అండ్ స్టోర్స్ ఆఫీసర్–ఎ:** 1

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమాతో పాటు పని అనుభవం.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు రుసుము: జనరల్/ ఓబీసీ అభ్యర్థులకు రూ.750. పీహెచ్/ మహిళలు/ ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 18.10.2023.

హార్డ్ కాపీ దరఖాస్తుకు చివరి తేదీ: 20.10.2023.

వెబ్‌సైట్: www.sctimst.ac.in/

ఆప్టెల్ లిమిటెడ్‌లో సీనియర్ మేనేజర్‌లు

దేహ్రాదూన్‌లోని ఇండియా ఆప్టెల్ లిమిటెడ్ ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన 4 సీనియర్ మేనేజర్ (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

అర్హత: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) మెంబర్ లేదా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా (ఐసీఎంఏఐ) మెంబర్ అయి ఉండాలి. సంబంధిత రంగంలో పని అనుభవం ఉండాలి.



వయసు: 40 సంవత్సరాలు మించకూడదు.

ఎంపిక: అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా.

దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'వర్క్స్ మేనేజర్ (హెచ్ఆర్), ఇండియా ఆప్టెల్ లిమిటెడ్, ఓఎఫ్ఐఎల్ క్యాంపస్, దేహ్రాదూన్ (ఉత్తరాఖండ్)' చిరునామాకు పంపించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: ఎంప్లాయ్‌మెంట్ న్యూస్/ న్యూస్‌పేపర్‌లలో ప్రకటన వెలువడిన సెప్టెంబరు 30 నుంచి 15 రోజుల్లోగా పంపాలి.

వెబ్‌సైట్: https://www.indiaoptel.in/careersnjobs/

కుంగుబాటు అసలొద్దు.. దిద్దుబాటే మేలు

బాగా చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలనుకుంటారు విద్యార్థులు. పోటీ పరీక్షల్లో విజయం కోసం ఎంతగానో కృషిచేస్తుంటారు ఉద్యోగార్థులు. అయితే అన్నీ అనుకున్నట్టుగా జరగవు కదా.. ఒక్కోసారి ఎంత కష్టపడినా ఫలితాలు అనుకూలంగా రాకపోవచ్చు. అలాంటప్పుడు అంతా అయిపోయిందంటూ కుంగిపోయి నిరాశతో బాధపడుతూ కూర్చుంటే.. ఆ ప్రభావం తర్వాత రాసే పరీక్షలపైనా, చేసే ప్రయత్నాలపైనా ప్రతికూలంగా పడుతుంది. అందుకే అప్పుడప్పుడూ మన తీరుతెన్నులనూ, కృషినీ పరిశీలించుకోవాలి. సమీక్షించుకుని దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి.

ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. వెంటనే సహవిద్యార్థులతో మిమ్మల్ని మీరు పోల్చుకుని ఇక దేనికీ పనికిరామనే తొందరపాటు నిర్ణయానికి వచ్చేయకూడదు. ఇలాంటి సమయంలోనే మీ పని తీరును ఒకసారి సమీక్షించుకోవాలి. ఎదుటివారి గెలుపు.. మీ ఓటమి.. దీని గురించి మాత్రమే ఆలోచిస్తూ కూర్చోకూడదు. మీరో టైమ్‌టేబుల్ వేసుకుని ఉండొచ్చు. అయితే దాన్ని పూర్తిగా ఆచరించారా లేదా? లోపం ఎక్కడ జరిగింది. ఎక్కువ గంటలపాటే చదివినా.. ఇతర విషయాల గురించి ఆలోచిస్తూ పైపైనే చదివారా? ఇష్టమైన సబ్జెక్టులనే చదువుతూ క్లిష్టంగా ఉన్నవాటిని వదిలేశారా... పొరపాటు ఎక్కడ జరిగింది... ఇలా వివిధ రకాలుగా మీ సన్నద్ధత కృషిని గమనించుకుని, సమీక్షించుకోవాలి.

✪ చేదు విమర్శలను ఒక పట్టాన మర్చిపోలేరు. అవి పదేపదే గుర్తొచ్చి మానసిక ప్రశాంతతను దెబ్బతీస్తాయి. ఆకర్షణీయంగా లేరనో.. పదిమందితో కలవలేరనో.. అందరిముందూ ధైర్యంగా మాట్లాడలేరనో... ఇలాంటి కారణాలతో ఎవరైనా మిమ్మల్ని తేలిగ్గా మాట్లాడివుండొచ్చు. 'వీటిని అసలు పట్టించుకోవద్దు..' అని చెప్పడం చాలా తేలికే కానీ, వీటిని ఎదుర్కొన్నవారికి మనసు కాస్త కష్టంగానే ఉంటుంది. చదువుతున్నా, నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నా ఇవే గుర్తొస్తుంటాయి కూడా. ఆ విమర్శల్లో నిజానిజాలేమిటో వాస్తవికంగా ఒకసారి సమీక్షించుకోవాలి.

✪ మన లోపాలను చూసి ఇతరులు హేళన చేయడం ఎంతో బాధ కలిగిస్తుంది. అది నిజమే కానీ.. ఉక్రోషాన్ని పక్కనపెట్టాలి. ప్రతికూల వ్యాఖ్యల్లో మనం సరిదిద్దుకోగలిగేవి ఉన్నాయేమో ఒకసారి ఆలోచించాలి. వాటిని మెరుగుపరుచుకోవడానికి ప్రయత్నించాలి. నలుగురిలోనూ కలవడం, మాట్లాడటం మీకు రాకపోవచ్చు. దీన్ని మెరుగుపరుచుకునే దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టొచ్చు. అయితే ఇక్కడో ముఖ్య విషయాన్నీ గుర్తుంచుకోవాలి. మిమ్మల్ని బాధపెట్టడమే లక్ష్యంగా విమర్శించే వాళ్లూ కొందరు ఉంటారు. అలాంటివారి గురించీ, వారి వ్యాఖ్యల గురించీ ఎంత తక్కువగా ఆలోచిస్తే అంత మంచిది.

✪ కుటుంబ సమస్యలు ముఖ్యంగా.. ఆర్థిక సంబంధమైనవీ, అనారోగ్యపరమైనవీ ఎవరినీ ఒక పట్టాన కుదురుగా ఉండనీయవు. తరగతిలో పాఠాలు వింటున్నా.. చదవడానికి కూర్చున్నా ఇవే గుర్తుకొస్తూ ఇబ్బంది పెట్టొచ్చు. అయితే వీటిని పరిష్కరించే అనుభవం, మానసిక పరిపక్వత మీకు లేకపోవచ్చు. అలాంటప్పుడు కుటుంబ సభ్యుల సలహాలు, సూచనలు తీసుకుని మీ పరిధి మేరకు పరిష్కార దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టొచ్చు.

✪ అనుకోని పొరపాట్లు, తప్పుల వల్ల కూడా కొన్నిసార్లు మాటపడాల్సి రావచ్చు. ఇలాంటప్పుడు కూడా సమీక్ష ఎంతో అవసరం. తప్పు చేసి మాటపడాలని ఎవరూ అనుకోరు. అన్యమనస్కంగా, ఆసక్తి లేకుండా పని చేయడం వల్ల ఇలాంటి ఇబ్బంది రావచ్చు. కాబట్టి పొరపాట్ల వెనుక ఉన్న అసలు కారణాలను గ్రహించి అవి పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవటం సముచితం!

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్

హైదరాబాద్‌లో

టెంపెస్ట్ అడ్వర్టైజింగ్‌లో.. డిజిటల్ మార్కెటింగ్

స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 9
అర్హతలు: డిజిటల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఫేస్‌బుక్ మార్కెటింగ్, ఎస్ఈఓ, ఎస్ఈఎం నైపుణ్యాలు
☛ internshala.com/i/e9e64d

కాపీరైటింగ్

స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 9
అర్హతలు: కాపీ రైటింగ్ నైపుణ్యం
☛ internshala.com/i/82fd2e

సోషల్ మీడియా మేనేజ్‌మెంట్

స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 9
అర్హతలు: సోషల్ మీడియా మార్కెటింగ్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/dd091c

మార్కెటింగ్

సంస్థ: రిజల్
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 11
అర్హతలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, మార్కెటింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్, వీడియో ఎడిటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/316d89

కంటెంట్ రైటింగ్

సంస్థ: కెరియర్360
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 10
అర్హతలు: క్రియేటివ్ రైటింగ